క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి

హుకుంపేట: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని కోరుతూ సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు శుక్రవారం తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరుడు నల్లపు కనకరాజు చేపడుతున్న అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని వినతిలో కోరారు. రెవన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీ పెద్దలు తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ సర్పంచ్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ నాగమ్మను సన్మానిస్తున్న జగనన్న సేవా ట్రస్టు చైర్మన్ నిర్మల

డుంబ్రిగుడ: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నాగమ్మను జగనన్న సేవా ట్రస్టు జిల్లా చైర్మన్ కిమిడి నిర్మల శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. గోవింద్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చింతపల్లి: మండల కేంద్రంలోని శ్రీ లలితాదేవి ఆలయ నిర్మాణానికి జిల్లా ధర్మ ప్రసారకుడు అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10లక్షలతో ఆలయం నిర్మిస్తున్నట్టు ఆయన చెప్పారు. నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

భూములపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతగిరి: మండలంలోని అనంతగిరి, ఎగువశోభ, టోకూరు, కొండిబ పంచాయతీల్లో సుమారు 300 ఎకరాలకు సంబంధించి శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ రాంబాయి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ భూములకు సంబంధించి విజయనగరం రాజులు తమకు చెందినవంటూ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ నాలుగు పంచాయతీల్లో భూరీసర్వే నిర్వహించి వివరాలు నమోదు చేశారు. గిరిజనుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ పూర్వం నుంచి భూముల్లో సాగులో ఉన్నది గిరిజనులేనని, గిరిజనులకు న్యాయం చేయాలని వాటికి రక్షణ కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు. నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్‌లు రూతు, మోస్య, సింహాద్రి, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపను వాహనంలోకి ఎక్కిస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యూరు : మంప సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన కలపను పెదవలస రేంజర్ జగదీష్, ఎస్ఎస్‌వో సింహాద్రి శుక్రవారం పట్టుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ.25 వేలుగా ఉంటుందని రేంజర్ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి జరపగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న గన్నర, రోజ్‌ఉడ్ కలపను గుర్తించామన్నారు. కలపను గొలుగొండ కలప డిపోకు తరలిస్తామన్నారు. సిబ్బంది రాకేష్‌కుమార్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

హుకుంపేట: బొర్రంపాలెం జంక్షన్ నుంచి కాకరివలస గ్రామం వరకు ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.1.40లక్షతో రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పాడి పోతురాజు, ఎంపీటీసీ సభ్యురాలు సంబాయి కొండమ్మ శుక్రవారం ప్రారంభించారు. నాయకులు కామరాజు, అప్పలస్వామి, ప్రసాద్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రహదారులకు మోక్షం

- తురకలమెట్టకు రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణం
- గిరిజనుల హర్షం



తురకల మెట్ట రోడ్డు (ఫైల్)



తురకల మెట్ట రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

హుకుంపేట: ఆ గ్రామానికి మట్టి రోడ్డు ఆధారం.. రాళ్లు తేలి, గోతులతో నిండిన దారిపై ఏళ్ల తరబడి రాకపోకలు సాగించారు. చినుకు పడితే చిత్తడిగా మారేది.. సరైన రోడ్డు సదుపాయం లేక రవాణా కరువైంది..ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం... అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అందక గ్రామస్తులు పడిన అవస్థలు వర్ణనాతీతం. మండలంలోని మత్స్యపురం పంచాయతీ తురకలమెట్ట గ్రామ రహదారి దుస్థితి ఇది. గ్రామానికి రోడ్డు కోసం గత టీడీపీ హయాంలో పలుమార్లు పాలకులు, అధికారులకు గ్రామస్తులు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామస్తుల ఏళ్ల నాటి రహదారి కల నెరవేరింది.

శరవేగంగా పనులు

మండలంలోని మత్స్యపురం తురకలమెట్ట గ్రామంలో సుమారు 300 మంది నివాసముంటున్నారు. గ్రామానికి రోడ్డు లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచ్ పూజారి మేరీ స్పందించారు. సమస్యను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విషయాన్ని యంత్రాంగానికి తెలియజేశారు. ఈ మేరకు గున్నమామిడి గ్రామం జంక్షన్ నుంచి తురకలమెట్ట గ్రామం వరకు 2కిలో మీటర్ల మేర రూ.40లక్షల పీఆర్ నిధులతో గ్రావెల్ రోడ్డును మంజురు చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏళ్లనాటి రోడ్డు కల నెరవేరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సర్పంచ్ మేరికు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆనందంగా ఉంది



మా గ్రామంలో రహదారి సరిగ్గా లేక తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం. అధ్వాన దారితో రవాణా సౌకర్యం ఉండేది కాదు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామానికి రోడ్డు కోసం సర్పంచ్, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. రోడ్డు పనులు జరుగుతుండడం ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జోయో, తురకమమెట్ట గ్రామం, హుకుంపేట మండలం

రహదారి సమస్యలు తీరుస్తాం



నియోజకవర్గంలో శివారు గ్రామాల్లో సైతం రహదారులు ఏర్పాటు చేసి సమస్యలు తీరుస్తాం. గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. రహదారి లేని గ్రామాలను గుర్తించి రోడ్డు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అనేక గ్రామాలకు రహదారులు మంజూరు చేశాం. ప్రభుత్వ చొరవతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు నియోజకవర్గం

నవరత్నాలతో ఇంటింటా వెలుగులు



అసరాడలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



దాకోడులో స్థానికులకు పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

గూడెంకొత్తవీధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న నవరత్న పథకాలు ఇంటింటా వెలుగులు నింపుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చెప్పారు. మండలంలోని అసరాడలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 165 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పథకాలు చేరుతున్నాయన్నారు. కుట్ర రాజకీయాలు చేస్తున్న టీడీపీ, జనసేనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు శివరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం

డుంబ్రిగుడ: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ కోల్లాపుట్టు, డెక్కపారు, చంపగుడ, మొనిగుడ గ్రామాల్లో నాయకుడు చిక్కుడు రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 186 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులకు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మన్య ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధర్‌స్వామి, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు జెమ, సర్పంచ్ రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, కన్వీనర్ గణపతి, నాయకులు సింహాచలం, మల్లేష్, లింగు, లీలారాణి, నాగేశ్వరరావు , బలరాం, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

అడ్డతీగల: ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని శివారు గ్రామం దాకోడులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. పార్టీలకతీతంగా పథకాలు అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. గిరిజనులకు అటవీ భూముల హక్కు పత్రాలు అందజేసి చరిత్ర సృష్టించిందన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక ప్రగతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారన్నారు. ఎమ్మెల్యే కొంతమంది ప్రజలను కలిసిన అనంతరం అస్వస్థతగా ఉండడంతో మిగిలిన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు కొనసాగించారు. గ్రామంలో 120 గడపలను సందర్శించారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో కూరగాయల సాగు



విత్తనాలు జల్లుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. టమాటా, బెండ, బీర, కొత్తిమీర, గొంగూర, తోటకూర విత్తనాలను ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పద్మల, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి తదితరులు జల్లారు. అంజనాస్ ఫౌండేషన్ పలు రకాల విత్తనాలను సమకూర్చింది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలోని పెదఉరుము గ్రామంలో తాగునీటి బోరు నిర్మాణ పనులను సర్పంచ్ కిముడు రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ రూ.1.25లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆయా నిధులతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ విజయవంతం చేయాలి

అడ్డతీగల: మండలంలో రెండు అధికారుల బృందాలతో శనివారం నుంచి గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఒక బృందానికి తాను నేతృత్వం వహిస్తుండగా మరో అధికార బృందానికి తహసీల్దార్ తాతారావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉదయం 9 గంటల నుంచి ప్రారంభిస్తామన్నారు. అడ్డతీగల మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 20 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించే ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొయ్యూరు: మండలంలో శనివారం డౌనూరు, రావణాపల్లి, చిట్టింపాడు, రాజేంద్రపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దార్ తిరుమలరావు శుక్రవారం తెలిపారు.

జి.మాడుగుల: మండలంలో ఈ నెల 3 నుంచి 24వ తేదీ వరకు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు జారీకి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ రెండు బృందాలు ఏర్పడి వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించినట్టు చెప్పారు. వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల వివరాలు సేకరించి సచివాలయాలలోని డిజిటల్ సహాయకుల ద్వారా ఆన్‌లైన్ చేయించి మూడవ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యే శిబిరంలో లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

షెడ్యూల్ వివరాలు

జూలై 3న పెదలోచలి,వంతాల, 5న సొలభం-1, గడుతూరు, 7న గెమ్మెలి, వంజరి-1, 11న పాలమామిడి, వంజరి-2, 13న కోరాపల్లి, పెద్దలువ్వాసింగి, 15న జి.మాడుగుల-1, సింగర్భ, 18న కె కోడాపల్లి, జి.మాడుగుల-2, 21న నుర్మతి, భీరం, 24న బొయితిలి, సొలభం-2 గ్రామ సచివాలయాల్లో జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు గోవిందరాజులు తెలిపారు.

చింతూరు: మండలంలోని 13 సచివాలయాల పరిధిలో శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈనెల 1న పేగ, ఏడుగురాళ్లపల్లి, 4న చింతూరు-1, ముకునూరు, 6న చింతూరు-2, కుమ్మూరు, 7న చట్టి, 11న ఏజీకొడేరు, 13న చిడుమూరు, 14న తుమ్మల, చదలవాడ, 18న మోతుగూడెం, గూడూరులో కార్యక్రమం జరగనున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని తేగ, ఏడుగురాళ్లపల్లి సచివాలయం పరిధిలో శనివారం జరగన్న జగనన్న సురక్ష కార్యక్రమ వాయిదా వేసినట్టు తహసీల్దార్ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. మావోయిస్టుల ప్రభావం ఉన్నట్టు పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం, బడదనాంపల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుతీరును ఎంపీడీవో యాదగిరీశ్వరరావు శుక్రవారం పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. మండలంలో జగనన్న సురక్ష షెడ్యూల్‌ను తెలిపారు. స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ నేతృత్వంలో రెండు అధికారుల బృందం ఆయా సచివాలయాల పరిధిలో పర్యటిస్తారన్నారు. 1న బడదనాంపల్లి, శరభవరం, 3న దూసరపాము, కింద్ర, 5న తంటికొండ, లబ్బర్తి , 10న లోదొడ్డి, రాజవొమ్మంగి-1 , 12న వాతంగి, రాజవొమ్మంగి-2, 14న చికిలింత, జడ్డంగి, 17న గడుఓకుర్తి, వంచంగి, 19న చెరకుంపాలెం, అమీనాబాద్ సచివాలయాల్లో బృందాల ద్వారా సేవలు అందుతాయన్నారు.

కూనవరం: మండలంలోని రేగులపాడు సచివాలయాన్ని ఎంపీడీవో ఈ.ప్రేమ్‌సాగర్ శుక్రవారం సందర్శిం, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులతో కూడిన రెండు బృందాలు ద్వారా గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా జూలై 3 నుంచి జూలై 26 వరకు జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 3 -రేగులపాడు ,4న కూటూరు, 6న పెదార్కూరు, 11న చినార్కూరు, 13న కొండ్రాజుపేట, 14న కూనవరం, 18న జగ్గవరం, 19న చూచిరేవులగూడెం, 21న కరకగూడెం, 24న వెంకటాయపాలెం, 26న పోచవరం సచివాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుష్టుపై అవగాహన అవసరం



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

పెదబయలు: కుష్టువ్యాధి నియంత్రణపై వైద్య సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వర నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మూడు పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి ద్వారా కాళ్లు, చేతుల్లో పుండ్లు ఏర్పడుతాయన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిసే త్వరగా చికిత్సతో నిర్మూలించవచ్చన్నారు. గ్రామాల్లో ఈనెల 16వ తేదీ వరకు సర్వే చేపట్టి, అవగాహన పెంచాలన్నారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రసాదరావు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి టి.విశ్వేశ్వర నాయుడు శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బందికి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టి వివరాలు సేకరించాలన్నారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు, చర్మం పొడిగా ఉండడం, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ లేకపోడం, చల్లని, వేడి వస్తువులు పట్టుకున్న స్పర్శ తెలియకపోవడం వంటివి వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తుల్లో ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. లెప్రసీ బెంజ్‌మాన్ ఫిజియోథెరఫీ ప్రాజెక్టు ఆఫీసర్ శివరామకృష్ణ, వైద్యాధికారులు రమేష్, ప్రతాప్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కిలగాడ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బాక ఈశ్వరి

డుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాక ఈశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను ప్రస్తావించారు. దీనిపై అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర కార్యక్రమాలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని, ఇది పద్ధతి కాదన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఆస్పత్రుల నిర్వహణ



డాక్టర్ సాంబశివరెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరసింగరావు, కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుత్

సాక్షి, పాడేరు: ఏపీ మెడికల్ కౌన్సిల్‌లోని కీలకమైన యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్‌గా ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఇదే విభాగానికి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుత్‌ను నియమించింది. తప్పుడు రిజిస్ట్రేషన్లు, పత్రాలతో వైద్య వృత్తి, ఆస్పత్రుల నిర్వహణలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, చర్యలు తీసుకునే అధికారం యాంటీ క్వాకరీ చైర్మన్, సభ్యులకు ఉంటుంది. కీలక పదవిలో నియమితులైన డాక్టర్ నరసింగరావును మెడికల్ కౌన్సిల్ పాలకవర్గమంతా అభినందించింది. ఈ మేరకు విజయవాడలోని మెడికల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర యాంటీ క్వాకరి చైర్మన్‌గా నియమించడంలో కృషి చేసిన ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డిని, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్బ నరసింగరావుతో పాటు, కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుత్, సభ్యులు ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రుల నిర్వహణ సాగాలని లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రకృతి విధానంతో భూమి సారవంతం

వ్యవసాయ శాఖ ఏడీఏ విజయకుమార్



వ్యవసాయ విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

సాక్షి, పాడేరు : భూమి నిస్సారం కాకుండా ప్రకృతి విధానం తోడ్పాటునందిస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ విజయకుమార్ సూచించారు. ఆదివాసీమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాడేరులో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం వల్ల భూమి సేంద్రియ తత్వాన్ని కోల్పోతోందన్నారు. విదేశీ విత్తనాలను వినియోగించడం వల్ల తట్టుకొని పంట నిలదొక్కుకుంటుందన్నారు. రైతు సాధికారసంస్థ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రకృతి విధానంలో సాగు చేసేందుకు అవసరమైన వనరులు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థలు , వెలుగు సంఘాలు సంయుక్తంగా ఒక వేదిక ఏర్పాటు చేసుకొని ప్రకృతిసాగును విస్తరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రకృతి విధానంలో పండించిన పంటను ముందుగా రైతు సొంతానికి వినియోగించుకోవాలని, తర్వాత విత్తనాలను నిల్వ చేయగా మిగిలిన ఉత్పత్తులను అమ్మకం చేయాలని సూచించారు. రైతు సాధికార సంస్థ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ పచ్చారి దేవుళ్లు మాట్లాడుతూ ప్రకృతి విధానంలో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన మెలకువలు పాటించాలన్నారు. వరిలో శ్రీ పద్ధతి మాదిరిగానే రాగిలో సాగు చేస్తే ఎకరాకు 15నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ పద్ధతిని మరింత విస్తరించేందుకు ఐటీడీఏ సైతం తన వంతు సహకారం అందిస్తుందన్నారు. సంస్థ డైరెక్టర్ మన్మథరావు మాట్లాడుతూ ఆదివాసీ మిత్ర ఆధ్వర్యంలో 150 గ్రామాల్లో పని చేస్తున్నట్లు వివరించారు.మరో డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని ఆదివాసీలు ఆర్థికంగా అన్ని విధాలా అభివృద్ధి సాధించేందుకు సంస్థల ప్రణాళికలు చేసిందన్నారు. వీటిని ఆదివాసీలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన విత్తనాలు స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జెన్‌కో భద్రత కార్యాలయాలకు సిబ్బంది కొరత

సీలేరు: ఏపీ జెన్‌కో విద్యుత్ కాంప్లెక్స్ సీలేరు భద్రత కార్యాలయాలు సిబ్బంది కొరతతో మూడు రోజులుగా మూతపడ్డాయి. గడిచిన 50 ఏళ్లుగా సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విలువైన సామగ్రి తరలిపోకుండా వాటిని కాపాడేందుకు ఏఎస్‌వో కార్యాలయం ద్వారా సీలేరు నలుమూల భద్రత ఉంది. ప్రస్తుతం సిబ్బంది కొరత వల్ల గడిచిన మూడు రోజులుగా ఏఎస్‌వో కార్యాలయం, చెక్ పోస్ట్ మూసివేసే పరిస్థితి వచ్చింది. 36 మంది సిబ్బందికి 26 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కొందరిని డొంకరాయి, మోతుగూడెం, విద్యుత్ కేంద్రాలకు విధులకు పంపించడం వల్ల ఇక్కడ ఈ పరిస్థితి నెలకొంది.